# వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 175    బుధవారం | 10 జనవరి 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




## కోటి మొక్కులకు కొత్తకొండ సిద్ధం

- ఘనంగా భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం
- 18 వరకు జాతర, బ్రహ్మోత్సవాలు
- హాజరుకానున్న మంత్రి పొన్నం
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు

8లో





# మేయర్ చూపు కాంగ్రెస్ వైపు?

- పావులు కదుపుతున్నారంటూ ప్రచారం
- ఐదేళ్లు పదవిలో ఉండేలా పక్కా ప్లాన్
- హాట్ టాపిక్‌గా మారిన మంత్రి సీతక్కతో సమావేశం
- గ్రేటర్ లో మారుతున్న సమీకరణాలు
- చర్చనీయాంశంగా బీఆర్ఎస్ మేయర్, కార్పొరేటర్ల తీరు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. తిరుగులేని పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ఘోర పరాభవం చవి చూడటం ఇప్పుడు ఆ పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. దీంతో అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరి తమ కార్యకలాపాలు చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ముఖ్యనేతలను కలుస్తూ తాము పార్టీ మారుతామని సంకేతాలు ఇస్తున్నారు. ఇటీవల పలువురు బీఆర్ఎస్ కార్పొరేటర్లు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడమే ఇందుకు నిదర్శనం. తాజాగా బీఆర్ఎస్ మేయర్ గుండు సుధారాణి మంత్రి సీతక్కతో సమావేశం కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. త్వరలోనే మేయర్ అవిశ్వాస తీర్మానానికి సిద్ధమవుతుండటం... నేరుగా సుధారాణి వెళ్లి మంత్రిని కలువడం వెనుక మతలబు ఏంటో అనేది హాట్ టాపిక్‌గా మారింది. మొత్తంగా మేయర్ సుధారాణి అడుగులు వడివడిగా కాంగ్రెస్ వైపు పడుతున్నాయా.. అంటే రాజకీయ వర్గాలు అవుననే సమాధానం ఇస్తున్నాయి. - వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి

వివరాలు 2లో..



2లో

## మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

కలెక్టర్ సిక్తా పట్నాయక్

జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం

## సేవకుడా సెలవిక..

అశ్రునయనాల మధ్య రామా శ్రీనివాస్ అంత్యక్రియలు



7లో..



2లో

## బీజేపీ బలం పెరిగింది.. భాధ్యత పెరిగింది

- లోక్ సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి
- మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్

# మేయర్ చూపు.. కాంగ్రెస్ వైపు





**పావులు కదుపుతున్నారంటూ ప్రచారం**

**ఐదేళ్లు పదవిలో ఉండేలా పక్కా ప్లాన్**

**హాట్ టాపిక్‌గా మారిన మంత్రి సీతక్కతో సమావేశం**

**గ్రేటర్ లో మారుతున్న సమీకరణాలు**

**చర్చనీయాంశంగా బీఆర్ఎస్ మేయర్, కార్పొరేటర్ల తీరు..**

**వరంగల్ వాయిస్ ప్రత్యేక ప్రతినిధి :** నిన్న మొన్నటి వరకు రాష్ట్రంలో తిరుగులేని పార్టీగా అవతరించిన బీఆర్ఎస్ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థులు ఘోర పరాభవం చవి చూడటాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. మొన్నటి వరకు గులాబీ నేతలు అడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా సాగిన వారి వ్యవహారానికి ప్రజలు ఓటమి అనే తీర్పుతో చెక్ పెట్టారు. అయితే ఇన్నాళ్లు అధికారంతో విర్రవీగిన నేతలు మళ్లీ అధికారంలోకి వచ్చిన పార్టీలో చేరి తమ కార్యకలాపాలు చక్కదిద్దుకునే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ముఖ్యనేతలను కలుస్తూ తాము పార్టీ మారుతామనే సంకేతాలు ఇస్తున్నారు. ఇటీవల పలువురు కార్పొరేటర్లు బీఆర్ ఎస్ ను వీడి కాంగ్రెస్ లో చేరడంతోపాటు మరి కొందరు అదే బాటలో పయనించడం ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. తాజాగా మేయర్ గుండా సుధారాణి కూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు పావులు కదుపుతున్నట్లు ప్రచారం సాగుతోంది. మంత్రి సీతక్కను మంగళవారం హైదరాబాద్ లో సుధారాణి కలువడం, ఏకాంత సమావేశం నిర్వహించడం చర్చనీయాంశంగా మారింది. అయితే త్వరలోనే మేయర్ పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి చెందిన కార్పొరేటర్లు సిద్ధమవుతున్న తరుణంలో సుధారాణి నేరుగా మంత్రిని కలువడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం సుధారాణికి కొత్తేమి కాదంటూ కాంగ్రెస్ వర్గాలు దుయ్యబడుతున్నాయి. పచ్చగా ఉన్న ప్రాంతంలోనే తన పబ్బం గడుస్తుందని గట్టిగా నమ్మె నేతల్లో ఆమె మొదటి వరుసలో ఉంటుందంటున్నారు. పూర్తి కాలం మేయర్ పదవిలో కొనసాగేందుకే పార్టీ వీడే ఆలోచన చేస్తున్నారంటూ మండి పడుతున్నారు.

## వారిది అక్కా, చెల్లి అనుబంధం..

ములుగు ఎమ్మెల్యే, మంత్రి సీతక్క గతంలో తెలుగుదేశంలో పార్టీలో కొనసాగారు. మేయర్ సుధారాణి కూడా గతంలో ఆ పార్టీలోనే కీలకంగా పనిచేశారు. రాజ్యసభ సభ్యురాలిగా, టీడీపీ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా పలు స్థాయిల్లో పనిచేశారు. ఆ సమయంలో సీతక్క ములుగు నుంచి తెలుగుదేశం తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ ఎన్నికల సమయంలో ములుగు నియోజకవర్గ ఇంచార్జిగా గుండు సుధారాణి పనిచేశారు. వీరిద్దరి మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి. అక్కా, చెల్లెల మాదిరిగా ఉంటారనే టాక్ ఉంది. అయితే, ఇప్పుడు వీరిద్దరి అంశం ఎందుకు తెరపైకి వచ్చిందంటే.. మేయర్ సుధారాణి మంగళవారం హైదరాబాద్ వెళ్లి మంత్రి సీతక్కను కలిసింది. ఈ సమయంలో వారు రాజకీయేతర అంశాలు మాట్లాడుకున్నా.. గతంలో ఉన్న పరిచయంతో వెళ్లి కలిసినా.. చర్చ మాత్రం మేయర్ కాంగ్రెస్ లోకి వెళ్తారా.. అనే అంశం చుట్టే తిరుగుతోంది.

## ఆరుగురు కార్పొరేటర్లు జంప్..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా.. 10 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ ఘన విజయం సాధించింది. రెండు చోట్ల బీఆర్ఎస్ గెలిచింది. అయితే, రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి నెలరోజుల వ్యవధిలోనే బీఆర్ఎస్ నేతల చూపు.. కాంగ్రెస్ వైపు మళ్లింది. గతంలో జరిగిన కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ పీఠాన్ని బీఆర్ఎస్ కైవసం చేసుకుంది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో బీఆర్ఎస్ కార్పొరేటర్లు ఆరుగురు ఇప్పటికే కాంగ్రెస్ లో చేరారు. అదే దారిలో మరో 12 మంది కార్పొరేటర్లు ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అంతేకాదు, మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి సన్నద్ధం అవుతున్నారు. త్వరలో అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడతారని ప్రచారం ఊపందుకోవడంతో మేయర్ లో టెన్షన్ మొదలైంది. అవిశ్వాస తీర్మానం ఎదుర్కోవడం ఎందుకు అనుకున్నారో ఏమో.. కాంగ్రెస్ లో చేరితే ఈ తలనొప్పి ఉండదని భావించిన సుధారాణి కాంగ్రెస్ వైపు అడుగులు వేస్తూ ఉండవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అందుకే సీతక్కను కలిసి మేయర్ తన మనసులో మాట చెప్పి ఉండవచ్చని చర్చించుకుంటున్నారు. ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఎవరినీ పార్టీలో చేర్చుకోమని చెబుతున్నప్పటికీ పార్లమెంట్ ఎన్నికలు ముగిసిన తర్వాత.. కాంగ్రెస్ గేట్లు ఓపెన్ చేస్తుందని అప్పుడు రాజకీయ పరిణామాలు శరవేగంగా మారే అవకాశం ఉందని చెబుతున్నారు.

## కార్యకర్తల పరిస్థితి ఏంటి..?

ఏ పార్టీకైనా బలం. బలగం.. కార్యకర్తలే.. అధికారంలో ఉన్నా.. లేకపోయినా పార్టీకి చిత్త శుద్ధితో పనిచేస్తారు. కార్యకర్తల త్యాగ ఫలితమే నాయకులు అనుభవించే పదవులు.. కానీ, కొంత మంది నాయకులు ఈ విచక్షణ మరిచి పదవుల కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలో ఈజీగా చేరిపోతున్నారు. కానీ, కార్యకర్తలు ఎన్ని కేసులైనా.. నిర్భందాలు ఎదురైనా తాము నమ్మకున్న పార్టీ, సిద్ధాంతం కోసం ఊపిరి ఉన్నంత కాలం పనిచేస్తూనే ఉంటారు. దాడులు, ప్రతి దాడులతో ఇబ్బందులైనా పార్టీ జెండాను వీడరు. కడవరకు జెండాను మోస్తూనే ఉంటారు. కానీ, నాయకులు తమ పదువులు కాపాడుకునేందుకు, స్వలాభం కోసం రాత్రికి రాత్రి పార్టీ మారి క్యాడర్ కు తీరని ద్రోహం చేస్తున్నారు. అదే కార్యకర్తలు భుజాలు కాయలు కాసినా.. అలుపెరగకుండా పార్టీ జెండా మోస్తారు. పార్టీ జెండా నీడలోనే ఒదిగిపోతారు.. ఒరిగిపోతారు. కాటికెళ్లేంత వరకు.. కట్టె కలేంత వరకు పార్టీ జెండాతోనే లోకం విడిచి వెళ్తారు. అంతటి నిబద్ధత కార్యకర్తలకు ఉంటుంది. కానీ, నాయకుల లేదని చెప్పడానికి తాజాగా జరుగుతున్న, జరిగిన రాజకీయ పరిణామాలే నిదర్శనం..

## బీఆర్ఎస్ భవిష్యత్ పై నీలినీడలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎన్నిక ఏదైనా.. గులాబీ జెండా రెపరెపలాడింది. స్థానిక సంస్థలు మొదలుకొని.. పార్లమెంట్ ఎన్నికల వరకు బీఆర్ఎస్ విజయభేరి మోగించింది. బలమైన క్యాడర్ ఉన్న పార్టీగా ఉమ్మడి జిల్లాలో ఎదిగింది. కానీ, అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ చిత్తు చిత్తుగా ఓడిపోయింది. ఇప్పుడు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు గులాబీ బాస్ కాంగ్రెస్ పార్టీ రెక్కలు విరిచారు. పదేళ్లపాటు పార్టీని ముప్పు తిప్పలు పెట్టారు. పార్టీకి పెద్ద దిక్కు లేక కార్యకర్తలు తలో దారి చూసుకున్నారు. కానీ, చివరికి కాంగ్రెస్ పార్టీ తలబడి.. నిలబడింది.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వైపు బీఆర్ఎస్ చూపు మళ్లింది.. పార్టీని వీడి కాంగ్రెస్ లో చేరేందుకు ఎవరికీ వారు పావులు కదుపుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాల్లో విజయం సాధిస్తే భవిష్యత్ పై భరోసా లభిస్తుంది. లేదంటే బీఆర్ఎస్ పరిస్థితి మరో తెలుగు దేశం పార్టీ కాక తప్పదని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికే ద్వితీయ శ్రేణి నాయకులు తలో దారి వెతుక్కుంటుండగా.. జాతీయ పార్టీలు కాంగ్రెస్, బీజేపీని ఎదుర్కొని నిలబడతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. బీఆర్ఎస్ భవిష్యత్ ఏంటన్నది తేలాలంటే మరికొన్ని రోజులు వేచి చూడల్సిందే..

# బీజేపీ బలం పెరిగింది.. భాధ్యత పెరిగింది

**లోక్ సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

**మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**





**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణలో బీజేపీ బలం పెరిగింది.. బలగం పెరిగింది. అదే విధంగా ప్రజల పట్ల భాధ్యత కూడా పెరిగిందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హనుమకొండ జిల్లాలో ఒక రోజు పర్యటన చేసిన శివరాజ్ సింగ్ చౌహాన్ బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలతో సుడిగాలి పర్యటన చేశారు. బుధవారం మధ్యాహ్నం భోజనం తర్వాత హనుమకొండ హంటర్ రోడ్ లోని వేద ఫంక్షన్ హాల్ లో జరిగిన బీజేపీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ కోర్ కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై దిశానిర్దేశం చేశారు. అదే విధంగా ఉదయం దామెరలో సాయంత్రం హసన్ పర్తిలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పర్యటనలో వరంగల్ ప్రబారి డాక్టర్ బి.మురళీధర్ గౌడ్, మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర రావు, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, వన్నాల శ్రీరాములు, కొండేటి శ్రీధర్, బీజేపీ నాయకులు డాక్టర్ విజయ చందర్ రెడ్డి, చందుపట్ల కీర్తిరెడ్డి, జిల్లా ఇంచార్జి అడ్లూరి శ్రీనివాస్, గురుమూర్తి శివకుమార్, తాలపల్లి కుమారస్వామి, డాక్టర్ ఖాళీ ప్రసాద్, గుజ్జ సత్యనారాయణ రావు, కొలను సంతోష్ రెడ్డి, గుజ్జుల మహేందర్ రెడ్డి, భరత్ గౌడ్, తోపుచేర్ల మధుసూధన్ రావు, కనుకుంట్ల రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



## భద్రకాళి గుడిలో పూజలు..

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా హనుమకొండ జిల్లా పర్యటనకు వచ్చిన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ బుధవారం ఉదయం రావు పద్మతో కలిసి ఓరుగల్లు ప్రజల ఇలవేల్పు శ్రీ భద్రకాళీ అమ్మవారినీ దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివరాజ్ సింగ్ చౌహాన్ కి వేదపండితులు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# మత్తు పదార్థాలపై ఉక్కుపాదం

**కలెక్టర్ సిక్తా పట్నాయక్**

**జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** జిల్లాలో మత్తు పదార్థాల నియంత్రణకు అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో డ్రగ్స్ నియంత్రణపై వివిధ శాఖల అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో మత్తుపదార్థాల నియంత్రణకు అవగాహన కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అనుమానిత ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్, టీఎస్ న్యాబ్, ఎక్సైజ్, ఇతర శాఖల అధికారులు సమన్వయంతో పత్తు పదార్థాలను అరికట్టే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మత్తు పదార్థాల అమ్మకాలపై నిఘాను పెంచాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో మత్తుపదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై వివిధ శాఖల అధికారులతో చర్చించారు. ఈ సమావేశంలో వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ బారి, డీఈవో అబ్దుల్ హై, ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, టీఎస్ న్యాబ్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరడం ఖాయం

## బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్ భాస్కర్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పశ్చిమ నియోజకవర్గంలోని ముఖ్య నాయకులంతా తెలంగాణ భవన్ కు బయలుదేరారు. వారు బయలుదేరుతున్న బస్సును బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసనసభ్యుడు దాస్యం వినయ్ భాస్కర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ ప్రభుత్వ ఛీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ బుధవారం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఆధ్వర్యంలో వరంగల్ పార్లమెంటు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఉన్నందున నేడు మూడు బస్సులలో 150మంది ముఖ్య నాయకులతో కలిసి తెలంగాణ భవన్ కు బయలుదేరుతున్నామని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలోని మాజీ చైర్మన్లు, కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, వివిధ అనుబంధ సంఘాల ముఖ్య నాయకులతో ఈ బస్సులో ప్రయాణిస్తున్నామని తెలిపారు. మూడు బస్సులలో 150మంది వెళ్తున్నామని, వరంగల్ పార్లమెంట్ లో గులాబీ జెండా ఎగరేయడం ఖాయమనే ధీమాను వ్యక్తం చేశారు. 420హామీలతో అనేక అబద్ధాలు ఆడి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, తమ మేనిఫెస్టోలోని హామీలను నెరవేర్చకుండా కాలం వెళ్లదీస్తున్నారని అన్నారు. ప్రజాపాలనతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కొక్క మంత్రి ఒక్కొక్క విధంగా మాట్లాడుతూ ప్రజలను కన్ఫ్యూజ్ చేస్తున్నారని అన్నారు. అబద్ధాల హామీలు, వారంటీ లేని గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ పైన అసత్యాలు ప్రచారం చేస్తూ రోజులు గడుపుతూ, ప్రజలను మభ్య పెడుతున్నారని విమర్శించారు. రైతుబంధు, పెన్షన్లు సకాలంలో అందక రైతులు, పెన్షన్ దారులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పర్చేందుకు, అనేక నిధులు తీసుకురావడానికి, పార్లమెంటులో మనం గళాన్ని వినిపించాలంటే బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏ ఒక్కరోజు పార్లమెంట్ లో తెలంగాణ అభివృద్ధి గురించి గానీ, హామీల గురించి కానీ మాట్లాడలేదని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ సుందర్ రాజు యాదవ్, వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కన్వీనర్ తాళ్లపల్లి జనార్ధన్ గౌడ్, కార్పొరేటర్లు విజయలక్ష్మి, బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సోదా కిరణ్, సంకు నర్సింగ్, గుంటి రజిత శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, మహిళా నాయకులు, మీద దీపా అనుబంధ సంస్థల నాయకులు తరలి వెళ్లారు.

# అందరికి అయోధ్య రాముడి అక్షింతలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని సుధానగర్ బస్తీలో శ్రీరామభక్తులు అయోధ్య శ్రీరాముడి అక్షింతలు ప్రతి ఇంటికి ఇచ్చే కార్యక్రమంలో బజరంగ్ దళ్ తెలంగాణ ప్రాంత ప్రముఖ్ శివరాంజి బస్తి శ్రీరామ భక్తులతో కలిసి ఇంటింటికి వెళ్లి అక్షింతలు, శ్రీరామ భవ్యమందిరం ఫొటో, అయోధ్య తీర్థ క్షేత్ర ట్రస్ట్ వారి ఆహ్వాన పత్రిక అందజేశారు. జనవరి 22నాడు అయోధ్య శ్రీరామ భవ్య మందిరం ప్రారంభం అలాగే బాల రాముడి విగ్రహానికి ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందని, దీని లైవ్ కార్యక్రమం గుడిబండల్ దేవాలయంలో ఉంటుంది కాబట్టి, బస్తీవాసులు కుటుంబసమేతంగా జనవరి 22న గుడికి రావాలని కోరారు. అలాగే ఆ రోజు సాయంత్రం ప్రతి ఇంటి ముందు తప్పక 5దీపాలు వెలిగించి, దీపావళి పండుగలా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ నగర సంచాలన సమితి నుంచి వలుస అశోక్ కుమార్, డా.గుళ్లపెల్లి సదానందం, బండి కుమారస్వామి, ఆదిత్య సాయి, డోలి సత్యనారాయణ, అనంతుల కేదారి, గుడిబండల్ దేవాలయ మహిళా భక్తమండలి సభ్యులు పాల్గొన్నారు.


# నాలాపై అక్రమ నిర్మాణం

## అడ్డుకున్న కాలనీ వాసులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నగరంలోని 57వ డివిజన్ పరిధిలోని నాలాపై అక్రమ నిర్మాణం చేస్తున్న రవీందర్ ను కాలనీ వాసులు అడ్డుకున్నారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లావుల రాజయ్య అనే వ్యక్తి దగ్గర నుంచి 21/03/2023 నాడు నాలాకి కావలసిన భూమిని కాలనీ వాసులంతా కలిసి కొనుగోలు చేశారు. ఆ స్థలంలో మున్సిపాలిటీ సిబ్బంది డ్రైనేజీ నిర్మించారు. మున్సిపాలిటీ సిబ్బంది వేసిన డ్రైనేజీ పైనే బోరు వేయడానికి రవీందర్ ప్రయత్నించడంతో ఒక్కసారిగా కాలనీవాసులంతా గమనించి రవీందర్ ను మందలించడంతో ఈ స్థలం నాదేనని బుకాయిస్తూ ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని కాలనీవాసులపై మండిపడ్డాడు. గతంలో కూడా ఇలాగే మున్సిపాలిటీ నాలాపై అక్రమ నిర్మాణం చేస్తుండగా కాలనీవాసులంతా అడ్డుకున్న దాఖలు ఉన్నాయి. ఆ సమయంలో కాలనీవాసులంతా కలిసి మున్సిపల్ కమిషనర్ కు లేఖ రాస్తూ గ్రీవెన్స్ లో అందజేశారు. ఈ సమస్య పరిష్కారానికి మార్గం చూపించాలని కాలనీవాసులు అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో గడ్డం నరసయ్య, అందె గణేష్ బాబు, పులిగిల్ల రమేష్, దొడ్డిపాటి రవి, గరిగే రవికుమార్, పులి రంజిత్, తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన దరఖాస్తుల కంప్యూటీకరణ



**వరంగల్ వాయిస్, మరిపెడ :** మున్సిపాలిటీ పరిధిలో 15వార్డులకు గాను ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం దరఖాస్తులు 4965 స్వీకరించినట్లు మరిపెడ మున్సిపల్ కమీషనర్ రాజు తెలిపారు. బుధవారం మరిపెడ మునిసిపల్ ఆఫీస్ లో జరుగుతున్న నమోదు ప్రక్రియను మున్సిపల్ కమీషనర్ రాజు పరిశీలించారు. మున్సిపాలిటీ లో 4965దరఖాస్తుల కంప్యూటీకరణ ప్రక్రియ ముగిసిందని ఆయన తెలిపారు.

# ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్యవర్గం ఎన్నిక

## అధ్యక్షుడిగా మేరుగు మోహన్



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** నర్సంపేట డివిజన్ ఎలక్ట్రానిక్ మీడియా నూతన కార్య వర్గం ఎన్నికను బుధవారం పద్మశాలి గార్డెన్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా మేరుగు మోహన్ ఎన్నికయ్యారు. గౌరవ అధ్యక్షుడిగా గోడిశాల సదానందం, ఉపాధ్యక్షుడిగా మహాదేవుని జగదీష్, డివిజన్ కార్యదర్శిగా కే.రాజేంద్ర ప్రసాద్, సహాయ కార్యదర్శిగా నల్ల వంశీధర్ రెడ్డి, కోశాధికారిగా పొలసాని రవి, ముఖ్య సలహాదారులుగా బొందలపాటి కిరణ్, ఎర్రబెల్లి విద్యాసాగర్, ఊరటి రాజు, తాళ్లపెల్లి సురేందర్ రెడ్డి, ప్రచార కార్యదర్శిగా సౌడారపు మధు, కార్యవర్గ సభ్యులుగా సంగినేని ప్రశాంత్, గాండ్ల ప్రదీప్, హింగే రాజు, దొమ్మటి ప్రవీణ్, సోనబోయిన రాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మేరుగు మోహన్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అధ్యక్షుడిగా ఎన్నుకున్న ఎలక్ట్రాన్ మీడియా మిత్రులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

# సమన్వయంతో నేరాల కట్టడి

## వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక పోలీసులు, కేంద్రబలగాలు సమన్వయంతో పనిచేస్తే నేరాలను నియంత్రించడం మరింత సులభతరం అవుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలియజేశారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి రవాణాతో పాటు వాటి విక్రయాలను నియంత్రించడంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులకు పూర్తి స్థాయి సహయ సహకారాలను అందించడంలో కృషి చేస్తున్న కాజీపేట్, వరంగల్ రైల్వే ప్రోటెక్షన్ ఫోర్స్ చెందిన ఇన్ స్పెక్టర్లు యం.సంజీవరావు, టీ.ఎస్.ఆర్ క్రిష్ణలకు వరంగల్ పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా బుధవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ఇరు విభాగాల పోలీసులు సమన్వయంతో పనిచేస్తూనే నేరగాళ్ల సమాచారాన్ని ఇరువురు పంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని నేరాలను నియంత్రించడంలో కలిసి పనిచేద్దామని పోలీస్ కమిషనర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ యం.జితేందర్ రెడ్డి, టాస్క్‌ఫోర్స్ ఇన్ స్పెక్టర్ పి.దేవేందర్ పాల్గొన్నారు.

# రోటరీ క్లబ్ సేవలు ప్రశంసనీయం

## విద్యార్థులకు సైకిళ్లు, స్టడీ మెటీరియల్ పంపిణీ




**వరంగల్ వాయిస్, చెన్నారావుపేట :** మండలంలోని ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో 25సైకిళ్లను, 31మంది పదోతరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. ఉప్పరపల్లి హైస్కూల్ హెచ్ఎం టి.జయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యఅతిథిగా రోటరీ క్లబ్ సభ్యులు మండ వేణు, పరుపాటి సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం జయ మాట్లాడుతూ సుమారు లక్ష రూపాయల విలువైన సైకిళ్లు, స్టడీ మెటీరియల్ ను అందజేసిన రోటరీ క్లబ్ సభ్యుల సేవా నిరతి ప్రశంసనీయమన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థుల సంక్షేమం కోసం రోటరీ క్లబ్ సభ్యులు తమ సొంత డబ్బులతో వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టడం హర్షనీయమన్నారు. గత విద్యా సంవత్సరం కూడా ఉప్పరపల్లి హైస్కూల్ కు 10సైకిల్‌లను, ఒక లాప్ టాప్ ను రోటరీ క్లబ్ తరపున ఇచ్చారని కృతజ్ఞతలు తెలిపారు. మండ వేణు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలనే ఉద్దేశంతో, దూర ప్రాంతం నుంచి వస్తున్న బాలికల సౌకర్యార్థం 25సైకిళ్లను అందజేసినట్లు, వచ్చే విద్యా సంవత్సరం మరింత మంది బాలికలకు ఈ సౌకర్యాన్ని విస్తరిస్తామని పేర్కొన్నారు. రొటేరియన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ చెన్నారావుపేట, దుగ్గొండి మండలాలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల పదో తరగతి విద్యార్థులందరికి స్టడీ మెటీరియల్ అందజేశామని, దీనిని సద్వినియోగం చేసుకొని పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ర్యాంకు సాధించాలని కోరారు. 9.5 జీపీఏ కన్నా ఎక్కువగా సాధించిన విద్యార్థులకు పారితోషికం అందజేస్తామని ప్రకటించారు. పిన్నింటి బాలాజీ రావు సమన్వయకర్తగా వ్యవహరించిన ఈ సమావేశంలో సంఘ సేవకులు ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్ కుమార్, ఉదయ్ కుమార్, సీహెచ్.మాధవి, జి.సుందర్, కె.మాధవి, టి.మురళి, పీఈటీ రవీందర్, కె.మోహన్ రావు, జూనియర్ అసిస్టెంట్ జాహేద్, క్రాఫ్ట్ టీచర్ చింతకింది ఇందిర, రోటరీ క్లబ్ సభ్యులు దూదిపాల రాజిరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 10, జనవరి 2024
www.warangalvoice.net

# గ్రామీణ స్థాయిలో సీపీఐ బలోపేతానికి కృషి చేయాలి

## జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి




**వరంగల్ వాయిస్, మరిపెడ :** ప్రతి గ్రామంలో కమ్యూనిస్టు పార్టీని విస్తరింప చేయడానికి నాయకత్వం ప్రజలతో మమేకమై వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. మరిపెడ మండల కేంద్రంలో పార్టీ కార్యవర్గ సమావేశం జరగగా ముఖ్య అతిథిగా సుధాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీ పథకాలను అర్హులైన పేదలకు అందే విధంగా సీపీఐ నాయకత్వం పని చేసి ప్రజలకు దగ్గరై పార్టీని విస్తరింప చేసుకోవాలని సూచించారు. నూతన ప్రభుత్వం రైతు బంధు నగదును రైతుల ఖాతాలలో త్వరగా జమ చేయాలని, రెండు లక్షల రుణమాఫీకి మార్గదర్శకాలను తయారుచేసి అమలయ్యే విధంగా చర్యలు తీసుకొని ప్రజలలో విశ్వసనీయత పెరగడానికి ప్రయత్నించాలని అన్నారు. పార్టీ సభ్యత్వాన్ని నాయకత్వానికి అందించి త్వరితగతిన సభ్యత్వం పూర్తిచేసి, నూతన సభ్యుల చేర్పించడానికి కృషి చేస్తూ పార్టీ శత జయంతి ఉత్సవాల సందర్భంగా సీపీఐ వీరోచిత పోరాటాల ఘన చరిత్రను ప్రజలలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, అబ్దుల్ రషీద్, మల్లెపాక యాకన్న, పోలేపాక వెంకన్న, నారాయణ, అంజి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయి

## కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా కేంద్రంలో సంక్రాంతి పండుగ సందర్భంగా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో టోర్నమెంటు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ మలుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, సీనియర్ నాయకుడు బాదం ప్రవీణ్ హాజరై మాట్లాడుతూ క్రీడలు మానసికోల్లాసానికి దోహదపడతాయని అన్నారు. క్రికెట్ అసోసియేషన్ వారు సంక్రాంతి పండుగ సందర్భంగా మంచి ఆలోచనతో టోర్నమెంట్ ఏర్పాటు చేశారని, దీనిలో ఆడిన వారు రాబోయే రోజుల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి జట్టులో ఆడవచ్చని వారు పేర్కొన్నారు. క్రికెట్ ఆటతో శరీరం ధృడంగా ఏర్పడుతుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ క్రికెట్ ఆడి ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు రాజేందర్ గౌడ్, రవిచందర్ నాయక్, రేవంత్, వంగ రవి, క్రీడాకారులు పాల్గొన్నారు.

# ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాల క్యాలెండర్




**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని చర్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయ బృందం రూపొందించిన 2024 సంవత్సరం క్యాలెండర్ ను బుధవారం పరకాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ఫొటోలతో ముద్రించిన క్యాలెండర్ ను చూసి పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని, అంగన్వాడీ టీచర్లను అంతేకాకుండా ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధన కొనసాగిస్తున్నారని ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. రానున్న విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెరిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. తన వంతు సహాయ సహకారాలు ఎప్పటికీ ప్రభుత్వ పాఠశాలలకు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి గ్రామ సర్పంచ్ చాడ తిరుపతి రెడ్డి, పాఠశాల ఇంచార్జిప్రధానోపాధ్యాయుడు పోలంపల్లి విజేందర్, ఉపాధ్యాయులు శ్రీదేవి, సీడీపీఓ భాగ్యలక్ష్మి, అంగన్వాడీ సూపర్వైజర్ రోజా రాణి, అంగన్వాడీ టీచర్స్ లక్ష్మీ, నందిపాటి సంధ్య పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి

## వేటగాళ్లు పెట్టిన విద్యుత్ తీగలే కారణం



**వరంగల్ వాయిస్, ములుగు :** జిల్లా లోని పెగడపల్లి గ్రామంలో రైతు విద్యుత్ షాక్ తో మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పెగడపల్లి గ్రామానికి చెందిన మీనుగు సాంబయ్య (45) రైతు అతడికి ఉన్న పంట పొలం వద్దకు ఉదయం లేచి వేళుతుండగా వేటగాళ్లు అదే ప్రదేశంలో లెవెల్ కె విద్యుత్ వైర్ కు అడవి జంతువులను వేటాడేందుకు విద్యుత్ వైర్లు అక్కడ ఏర్పాటు చేశారు. అది గమనించని సాంబయ్య వ్యవసాయ పనుల నిమిత్తం ఉదయమే బయలుదేరాడు. అతని వ్యవసాయ భూమి వద్దకు చేరుకునే సరికి వేటగాళ్లు పెట్టిన విద్యుత్ వైరుకు తాకి బలమైన గాయాలయ్యాయి. అతడిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ములుగు ఎస్సై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఏఎన్ఎంకు షోకాస్ నోటీసులు

**వరంగల్ వాయిస్, ములుగు :** వాజేడు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంపై వార్తలలో వచ్చిన ఆరోపణలపై విద్యాలయాన్ని మంగళవారం ములుగు జిల్లా అదనపు కలెక్టర్ పి శ్రీజ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో ఏఎన్ఎం గా విధులు నిర్వర్తించే ఉద్యోగి ఉన్నత అధికారుల ఆదేశాలను పాటించడంలో నిర్లక్ష్యం వహించిన కారణంగా తనకు షోకాస్ నోటీసు ఇవ్వాలని సంబంధిత విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాలయాలపై తప్పుడు వార్తలు ప్రచారం చేయరాదని అన్నారు. రెండు రోజులుగా వాజేడు కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంపై వార్తలలో వాస్తవం లేదని అన్నారు. అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి సదరు ఏఎన్ఎంకు షోకాస్ నోటీస్ జారీ చేశారు. అదే పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు తన వ్యక్తిగత కారణాల వల్ల విధులు నిర్వర్తించలేనని తన రాజీనామా పత్రాన్ని సంబంధిత ప్రత్యేక అధికారికి, డీఈఓకు అందించడం జరిగింది. ఉద్యోగి రాజీనామాను కూడా డీఈఓ ఆమోదించినట్లు తెలిపారు.

# మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**వరంగల్ వాయిస్, మరిపెడ :** తెలంగాణ మోడల్ స్కూల్ లో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ప్రవేశ పరీక్ష కోసం ఈనెల 12 నుంచి ఫిబ్రవరి 22వరకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకొవాలని ప్రిన్సిపాల్ ఎస్ ఎలియట్ ప్రేమ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6వ తరగతిలో 100సీట్లకు గాను, 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీలను అనుసరించి భర్తీ చేస్తారన్నారు. హాల్ టిక్కెట్ ఏప్రిల్ 1 నుంచి చేసుకోవాలన్నారు. ఏప్రిల్ 7న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. వివరాల కోసం పాఠశాల ఆఫీస్ లో సంప్రదించవలసిందిగా ప్రిన్సిపాల్ తెలిపారు.

# పార్టీ సమావేశానికి నడికూడ బీఆర్ఎస్ నాయకులు



**వరంగల్ వాయిస్, నడికూడ :** పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అదేశాల మేరకు బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో జరుగుతున్నటువంటి వరంగల్ పార్లమెంటరీ నియోజకవర్గ సన్నాహక సమావేశానికి నడికూడ బీఆర్ఎస్ నాయకులు తరలివెళ్లారు. నడికూడ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దురిశెట్టి చంద్రమౌళి(చందు), ప్రధాన కార్యదర్శి నందికొండ గణపతి రెడ్డి, వైస్ ఎంపీపీ చందా కుమారస్వామి, నడికూడ మండల సమన్వయ కమిటీ సభ్యులు బొల్లె భిక్షపతి, నందికొండ జయపాల్ రెడ్డి, కోడెపాక కరుణాకర్, మచ్చ రవీందర్, బీముడి నాగిరెడ్డి, పర్నెం తిరుపతి రెడ్డి, తిప్పర్తి సాంబశివ రెడ్డి, సుధాటి వెంకటేశ్వర్ రావు, గోల్కొండ సదానందం తదితరులు ఉన్నారు.

# గీత కార్మికుడికి తీవ్ర గాయాలు



**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గీతా కార్మికుడు శ్రీపతి చంద్రమౌళి గౌడ్ బుధవారం ఉదయాన వృత్తిరీత్యా తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడ్డారు. గమనించిన తోటి గీతా కార్మికులు చికిత్స నిమిత్తం ఆయనను వెంటనే చిట్యాల మండల కేంద్రంలోని సివిల్ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స చేస్తున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా ఆయనను ఆకినపల్లి గ్రామ గౌడ సంఘం సొసైటీ అధ్యక్షుడు గండు రమేష్ గౌడ్ పరామర్శించారు.ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఫీజు నియంత్రణ చట్టం తేవాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అధిక ఫీజులు వసూలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం తేవాలని జాతీయ బీసీ యువజన సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి కల్లూరి పవన్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్స్ లో అధిక ఫీజులు పేద పిల్లల దగ్గర వసూలు చేయడమే కాకుండా ఫీజులు కట్టకుంటే హాల్ టికెట్స్, సర్టిఫికెట్ లు ఇవ్వడం లేదన్నారు. కనీసం ఇప్పుడు ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ఫీజులు వసూలు చేసే స్కూల్స్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని కార్పొరేట్ స్కూల్స్ లో లక్షల లక్షలు వసూల్ చేస్తున్నారని, వాటి పైన నిఘా పెట్టి ఫీజు నియంత్రణ చట్టం ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పిల్లల ఫీజులలో రాయితీ కల్పించాలన్నారు. అలాగే జర్నలిస్ట్ పిల్లలకు స్కూల్స్, కాలేజీ లలో ఉచిత విద్య ను అందించాలని కోరారు.

# స్నేహితుడి కుటుంబానికి చేయూత



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** స్థానికుడు నీరటి వీరన్న గత కొద్ది రోజుల క్రితం మరణించారు. దీంతో ఆయన మిత్రులు 1992 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు వారి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 15వేలను బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్వతగిరి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జూలపల్లి రత్నాకర్ రావు, గుర్రం యాదగిరి,వేమూరి సోమేశ్వర్, నీరటి సదానందం, నరుకుడు రవీందర్, బుద్ధ కుమారస్వామి పాల్గొని వీరన్న కుటుంబానికి ఆర్థిక సాయం అందించారు.

## తహసీల్దార్‌కు ఘన సన్మానం



**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** స్థానిక తహసీల్దార్ ఆఫీస్‌లో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ ను బుధవారం గిరిజన సంఘం స్టేట్ వైస్ చైర్మన్ బీమా సాహెబ్, యుఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మాలోత్ రాజేష్ నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం స్టేట్ వైస్ చైర్మన్ బీమా సాహెబ్ మాట్లాడుతూ భీమదేవరపల్లి మండలం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టడం ఎంతో సంతోషకరమని వారు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మండలంలో రైతులు అనేక మంది భూ సమస్యల పట్ల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని తహసీల్దార్ ను కోరడం జరిగింది. సన్మానించిన వారిలో నాయకులు మంగ్య సతీష్, చిరంజీవి, కిషన్, రాజు, మహేష్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

## ప్రజాపాలన దరఖాస్తుల నమోదు ప్రక్రియ తనిఖీ

### యాసంగి బియ్యం లక్ష్యం గడువులోగా పూర్తి చేయాలి

### జిల్లా కలెక్టర్ శివలింగయ్య



**వరంగల్ వాయిస్, జనగామ :** రఘునాథపల్లి మండలం, ఖిలాషాపూర్, పీఎంఆర్ రైస్ మిల్, రికార్డుల తనిఖీ చేసి సీఎంఆర్ లక్ష్యాలను గడువు లోగా పూర్తి చేయాలని మిల్లర్లను బుధవారం జనగామ జిల్లా కలెక్టర్ హెచ్.శివలింగయ్య అధికారులను ఆదేశించారు. అనంతరం రఘునాథపల్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన సందర్భంగా స్వీకరించిన దరఖాస్తుల ఆన్లైన్ కంప్యూటరీకరణను తనిఖీ చేశారు. దరఖాస్తు చేసుకున్న వివరాల నమోదు ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత డాటా ఎంట్రీ ఆపరేటర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారులు, డీసీఎస్ఓ రోజా రాణి, విజయ డైరీ స్పెషల్ ఆఫీసర్ ధనరాజ్, డీటీ శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా స్థావరాలపై దాడులు



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కురవి మండలంలోని భద్రు తండా, తులస్య తండా, లచ్చిరాం తండాలలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించి ఒక అశోక్ లేలాండ్ ఫోర్ వీలర్ వెహికల్, రెండు వేల కిలోల బెల్లం, 100కిలోల పట్టిక, 20లీటర్ల సారాయి సీజ్ చేసి నలుగురు వ్యక్తులపై(ఏ1 షేక్ సైదులు రూరల్ ఆఫ్ ఖమ్మం, ఏ2.భూక్య సురేష్ రూరల్ ఆఫ్ మహబూబాబాద్, ఏ3 మూడు జగన్, ఏ4 మూడు బాబు రూరల్ ఆఫ్ భద్రతండా) కేసు నమోదు చేయడం జరిగింది. ఈ దాడుల్లో డీటీఎఫ్ ఎస్ఐ మహబూబాబాద్ ఎస్.హరీష్, ఎక్సైజ్ ఎస్సై జి.మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి పరామర్శ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండలం వెల్ది గ్రామానికి చెందిన ఎంజే టీవీ రిపోర్టర్ రాసమల్ల యాకాస్వామి కొద్ది రోజుల క్రితం గుండెపోటుతో మృతిచెందారు. దీంతో విషయం తెలుసుకున్న కడియం ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ కడియం కావ్య బుధవారం వారి నివాసానికి వెళ్లి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బాధిత కుటంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. వారి వెంట బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు, మాజీ ప్రజా ప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు కడియం యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## సహకార సంఘ చట్టాలపై అవగాహన అవసరం

### జిల్లా సహకార అధికారి సయ్యద్ ఖుర్షీద్




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** చట్టాలపై సరైన అవగాహన ఉన్నప్పుడే వాటిని సమర్థవంతంగా అమలు చేయడం సాధ్యమవుతుందని, అవగాహన కోసమే శిక్షణ అనేది ఉపయోగపడుతుందని సయ్యద్ ఖుర్షీద్, జిల్లా సహకార అధికారి మహబూబాబాద్ తెలియజేశారు. బుధవారం ఐడీఓసీ కలెక్టరేట్ లో సహకార సంఘాల సిబ్బందికి సహకార సంఘాల చట్టం రూల్స్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కాకతీయ సహకార శిక్షణ కళాశాల వరంగల్ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ శిక్షణా కార్యక్రమానికి జిల్లా సహకార అధికారి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో నేర్చుకున్న విషయాలను తమ తమ సంఘాలలో అమలు చేసి, సంఘాల రికార్డులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో కాకతీయ సహకార కళాశాల ప్రిన్సిపాల్ ఎల్ యాకూబ్ పాల్గొని శిక్షణార్థులకు శిక్షణ సామాగ్రిని అందజేశారు. కాకతీయ సహకార కళాశాల పనితీరు, శిక్షణకు వారు తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పి.రాజయ్య, ఎస్.వెంకటేశ్వర్లు అధ్యాపకులుగా శిక్షణ నిర్వహించారు. సహకార సంఘాల చట్టం, రూల్స్, సంఘ నియమావళిని గురించి కూలంకుషంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏవీ రాజశేఖర్ రెడ్డి, సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ లు ఎం.ప్రవీణ్, డి.రాజేష్ సయ్యద్ గౌస్, సీనియర్ ఇన్ స్పెక్టర్లు ఎండీ.యాకోబు అలీ, అఫ్జలుద్దీన్, శ్రీనివాస్, గోపీనాథ్, రాణి, శ్రీలక్ష్మి లతో పాటు జిల్లాలోని వివిధ సంఘాల కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలి

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం పరకాల నియోజకవర్గం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ ప్రచార కమిటీ కన్వీనర్ తీన్మార్ మల్లన్న, పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాష్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వరంగల్ పార్లమెంట్ కాంటెస్టెడ్ ఎంపీ దొమ్మటి సాంబయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల ఓటరు జాబితా షెడ్యూల్ ను విడుదల చేసిన ఈసీ ఫిబ్రవరి 6లోపు ఖమ్మం, నల్గొండ, వరంగల్ ఎమ్మెల్సీ ఓటర్ నమోదు ప్రక్రియను పట్టుబధ్రులందరూ 2020నవంబర్ లోపు ఉన్న ప్రతి ఒక్క ఓటరు ఫామ్ 18 నింపి ఏంఆర్వోకు పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలని వారు తెలిపారు. ఓటు హక్కును వినియోగించుకునే విధంగా పరకాల నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు అందరూ పట్టుభద్రుల ఓటరు మహాశయులను కలిసి దగ్గరుండి వారిని నమోదు చేయించి త్వరలో వెల్లడించే కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థిని కాంగ్రెస్ పార్టీ పక్షాన భారీ మెజారిటీతో గెలిపించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరకాల నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, వివిధ మండలాల కమిటీ అధ్యక్ష కార్యవర్గం, జిల్లా ముఖ్య నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కాజీపేట :** సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఎలక్ట్రిక్ లోకో షెడ్ బ్రాంచ్ వారు, బ్రాంచ్ పేరుతో ముద్రించిన క్యాలెండర్ ను బుధవారం సీనియర్ డిఈఈ ఎలక్ట్రిక్ లోకో షెడ్ ప్రశాంత్ కృష్ణ సాయి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం సీనియర్ డీఈఈ మాట్లాడుతూ ముందుగా అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇంత చక్కటి క్యాలెండర్ ను ముద్రించిన ఎస్ సీ ఆర్ఎంయూ/ఈఎల్ఎస్ బ్రాంచి కార్యవర్గాన్ని అభినందించారు. ప్రతి సంవత్సరం ఇలాంటి కార్యక్రమాల్ని మరెన్నో చేపట్టాలని, అలాగే ఈ సంవత్సరం కూడా మీరు కార్మికుల సమస్యల పట్ల ముందుకు సాగి కార్మికుల మన్ననలు పొందాలని వారికి సూచించారు. అనంతరం బ్రాంచ్ సెక్రటరీ నాయిని సదానందం సీనియర్ డీఈఈకి కృతజ్ఞత భావంతో ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ చైర్మన్ ఎండీ.ఇబ్రహీం, ట్రెజరర్ ఎండీ.రహమత్ అలీ, వైస్ చైర్మన్లు బి.రవీందర్ రెడ్డి, ఎన్.అరుణ్ కుమార్, వై.శ్రీనివాసులు, జి.వీర ప్రకాష్ బాబు, అసిస్టెంట్ సెక్రటరీలు డి.కుమారస్వామి, పి.రాజు, పి.చంద్రశేఖర్, యూత్ ప్రెసిడెంట్ ఎం.శివప్రసాద్, యూత్ సెక్రటరీ ఆర్.శ్రీను, యూత్ కన్వీనర్ ఎం.నరేష్, యూత్ కో కన్వీనర్ డీఎస్.రాజీవ్, జనరల్ ఇన్ స్టిట్యూట్ జాయింట్ సెక్రెటరీ ఎం.రాజయ్య, ఈసీసీఎస్ ఢిల్లీ గేట్స్ బి.శ్రీనివాస్, బి.సునీల్, ఈఎల్ఎస్ కార్మికులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## మానసిక దివ్యాంగులతో సంక్రాంతి సంబరాలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ది.నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. పిల్లలు హరిదాసు, సోదెమ్మ వేషధారులై అలరించారు. భోగిమంటలు వేసి, పతంగులు ఎగురువేసి, బొమ్మలకొలువు పెట్టి, చక్కని రంగవళ్లులువేసి ఆట పాటలతో, పిల్లలకు భోగి పల్లు పోసి అనితా రెడ్డి పిల్లలతో పాటు సందడి చేశారు. ముందే వచ్చిందా సంక్రాంతి అన్నట్లు సాగింది వేడుక. ఈ సందర్భంగా డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ పండుగ అంటే మనం మాత్రమే సంతోషంగా ఉండటం కాదని, పది మందిని కలుపుకొని, పదిమందికి ఆనందాన్ని పంచడమే నిజమైన పండుగ అన్నారు. సహజంగా ఉండే పిల్లలతో ఎవరైనా ఏ వేడుక అయినా జరుపుకుంటారని ఇలా కల్మషం ఎరుగని మానసిక దివ్యాంగులకు పండుగ సంతోషం పంచాలనే ఇక్కడ ఈ వేడుక జరిపామని తెలిపారు. ఈ పిల్లల ఆనందం చూసాక ఎంతో సంతృప్తి కలిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సుచరిత, రాజేందర్ రెడ్డి, సుష్మా, కరుకాల ఆర్విక, వసుధ, హరిత తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్ Evening Daily
బుధవారం 10, జనవరి 2024
www.warangalvoice.net

# మోడల్‌గా అగ్రంపహాడ్ జాతర ఉండాలి

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి





**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతర ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లను పూర్తి చేయాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అన్నారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని సమావేశపు హాల్ లో బుధవారం అగ్రంపహాడ్ సమ్మక్క, సారలమ్మ జాతర సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ అగ్రంపహాడ్ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు బాధ్యతయుతంగా పనిచేయాలన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తి చేసి మోడల్ గా జాతర ఉండాలన్నారు. భక్తులు ఇలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతర కు లక్షలాది మంది భక్తులు దర్శనం కోసం వస్తారు కనుక అందుకు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. జాతర సమయంలో పారిశుధ్య నిర్వహణ, భక్తులకు తాగునీరు, స్నానాల కోసం నీటి సౌకర్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా వాహనాల పార్కింగ్, తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. జాతరకు మహిళలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుంది కనుక అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, మహిళా పోలీసు సిబ్బంది ఎక్కువగా విధులు నిర్వర్తించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తగినన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆర్టీసీ బస్సుల సౌకర్యాన్ని పెంచాలన్నారు. జాతరలో పారిశుధ్య నిర్వహణ నిరంతరం చేపట్టాలని, చెత్తాచెదారం త్వరితగతిన ట్రాక్టర్ల ద్వారా తరలించే విధంగా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ వినియోగించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, ప్లేట్లు,ప్లాస్టిక్ సంబంధించిన ఇతరత్రాలను దుకాణదారులు అమ్మకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జాతరకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ అగ్రంపహాడ్ జాతరకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల 18వ తేదీ నాటికి అన్నీ ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. నిర్ణీత సమయానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. జాతరకు మహిళలు ఎక్కువ వచ్చే అవకాశం ఉంది కనుక అందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జాతరలో ప్లాస్టిక్ వాడకాన్ని నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లను త్వరలో తగుతున్న పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, మహేందర్ జీ, డీసీపీ రవీందర్, పరకాల ఆర్డీవో శ్రీనివాస్, ఏసీపీ కిషోర్ కుమార్, దేవాదాయ, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, అగ్నిమాపక, ఆర్ అండ్ బీ, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కొండాకు శ్రీవారి ప్రసాదం అందజేత



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను హైదరాబాదులోని ఆమె నివాసంలో బుధవారం సుస్మిత గార్డెన్ యజమాని ఎల్. శ్రీనివాస్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తిరుమల శ్రీవారి ప్రసాదం, డైరీని అందజేశారు.

## తెలంగాణ మావోయిస్టు పార్టీ కార్యదర్శిగా బడే చొక్కా రావు



**వరంగల్ వాయిస్, ములుగు :** మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి ప్రాంతానికి చెందిన మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను ఆ పార్టీ నియమించినట్లు తెలిసింది. ఇటీవలే ఆయన కేంద్ర కమిటీ సభ్యుల సమక్షంలో పూర్తి బాధ్యతలు స్వీకరించారు. మావోయిస్టు పార్టీ మళ్లీ తన ఉనికిని చాటు కోవడంతో పాటు తెలంగాణలో పాగా వేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఛత్తీస్ గఢ్ దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు తమ సామ్రాజ్యాన్ని విస్తరిస్తూ అప్పుడప్పుడు అలజడులు సృష్టిస్తూ వస్తున్నారు. అయితే మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరించిన యాప నారాయణ అలియాస్ హరిభూషణ్ ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలో కోవిడ్ బారినపడి 21 జూన్ 2021లో మృతి చెందిన విషయం విదితమే. దీంతో అప్పటి నుంచి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి స్థానాన్ని భర్తీ చేసేందుకు ఆ పార్టీ కట్టుదిట్టమైన వ్యూహాలు రచించింది. ఈ స్థానాన్ని దక్కించు కునేందుకు మావోయిస్టు నేత ఆజాద్ సైతం తన వంతు ప్రయత్నాలు చేయగా చివరికి మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా మిలటరీ చీఫ్ బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ మల్లన్నను నియమించింది. ఇటీవల మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు అలియాస్ బసవరాజు ఏఓబీ రాష్ట్ర జోనల్ కమిటీ సభ్యుడు గాజర్ల రవి అలియాస్ గణేశ్, ఒడిశా రాష్ట్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సాయన్న కేంద్ర కమిటీ సభ్యుడు పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న, పీఎల్జీఏ బెటాలియన్ కమాండర్ మడివి హిడ్మా అలియాస్ హిడ్మాతో పాటు మరికొందరు కీలక నేతలతో జరిగిన సమావేశంలో బడే చొక్కారావుని తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమించారు.

## టీఎన్జీవోస్ నర్సంపేట యూనిట్ నూతన కార్యవర్గం ఎన్నిక



**వరంగల్ వాయిస్, నర్సంపేట :** స్థానిక టీఎన్జీవోస్ కార్యాలయంలో నర్సంపేట తాలూకా యూనిట్ కార్యవర్గ సమావేశం బుధవారం కడారి సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో నర్సంపేట డివిజన్ లోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులందరి సమక్షంలో నర్సంపేట తాలూకా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. టీఎన్జీవోస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గజ్జల రామ్ కిషన్ ఆదేశాల మేరకు ముఖ్య అతిథిగా హాజరైన టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి గాజె వేణుగోపాల్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. నర్సంపేట తాలూకా యూనిట్ నూతన అధ్యక్షుడిగా కడారి సురేష్ రెడ్డి, కార్యదర్శిగా హర్షవర్ధన్ రెడ్డి కోశాధికారిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా సంజీవ, భాస్కర్, రామలింగయ్య, నాగేందర్, సాయిరాం నాయక్, శ్రవణ్, జ్యోత్స్న, రమాదేవి, సంయుక్త కార్యదర్శిగా వినోద్, శేఖర్, రజాక్, రమేష్, శ్యామల, రమ, కార్యనిర్వాహక కార్యదర్శిలుగా రంజిత, మాశుక్, సలీం, ప్రచార కార్యదర్శులుగా రాంబాబు, నవీన్, వేణు, కార్యవర్గ సభ్యులుగా నీరజ, సందీప్ నాయక్, మీనా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి పాలకుర్తి సదానందం, సహాధ్యక్షుడు హేమా నాయక్, ఉపాధ్యక్షుడు గద్దల రాజు, పంచాయతీ ఫోరం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రఘు, సదానందం, జిల్లా బాధ్యులు రజిత, రాజేష్, కుమార స్వామి, సత్యనారాయణ, అజార్, ఐసీడీఎస్ ఫోరం అధ్యక్షురాలు రాజేశ్వరి, డివిజన్లలోని వివిధ శాఖలలో పనిచేస్తున్న ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఘనంగా వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం



**వరంగల్ వాయిస్, మరిపెడ:** పట్టణంలోని వాసవి క్లబ్ లో ఘనంగా వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ నూతన కార్యవర్గానికి ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. పట్టణ వాసవీక్లబ్ అధ్యక్షుడు గర్రెపల్లి వెంకన్న, ప్రధాన కార్యదర్శి ఉల్లి విజయ్ కుమార్, కోశాధికారి వంగవీటి కిరణ్, వనిత క్లబ్ అధ్యక్షురాలిగా గర్రెపల్లి మంజుల దేవి, ప్రధాన కార్యదర్శిగా సునీత, కోశాధికారిగా వంగవీటి జ్యోతిలను వీసీఐ ఇంటర్నేషనల్ జాయింట్ సెక్రెటరీ దొడ్డ మోహన్ రావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలోనూతన్ కుమార్, నాగభూషణం, సత్యనారాయణ, కిషోర్ కుమార్, సురేష్, భద్రయ్య నాగేశ్వరరావు, వాసవి క్లబ్ శాశ్వత ట్రస్ట్ సభ్యులు, నూతన కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫుట్ పాత్‌లపై ఆక్రమణల తొలగింపు

### జీడబ్ల్యూఎంసీ ప్రత్యేక డ్రైవ్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** హనుమకొండ నక్కలగుట్ట లోని కాళోజీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు బల్దియా ఆధ్వర్యంలో బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా ఆదేశానుసారం ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్, పట్టణ ప్రణాళిక , శానిటేషన్ విభాగాల సంయుక్తంగా రోడ్డకిరువైపులా ఉన్న ఆక్రమణల తొలగింపు కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఆక్రమణల తొలగింపు కార్యక్రమంలో భాగంగా బాటసారుల సౌకర్యార్థం ఫుట్ పాత్ లను ఆక్రమించుకొని ఏర్పాటు చేసుకొన్న నిర్మాణాలైన హోర్డింగ్స్,స్టేయిర్ కేస్ లు,ఫ్లెక్సీ లు, బోర్డులు, స్టాండ్లు, నామ ఫలకాలు, డబ్బాలను తొలగించడం జరిగిందన్నారు. అన్యాయంగా రహదారిని ఆక్రమించుకొని ట్రాఫిక్, బాటసారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భం గా అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్ఓ డా.రాజేష్, ఏసీపీ ఖలీల్, ట్రాఫిక్ ఏసీపీ బోజ రాజు, సీఐ షుకూర్ తో పాటు డీఆర్ఎఫ్, పట్టణ ప్రణాళిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్ట్‌ల పాత్ర కీలకం



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసిస్ట్స్ అసోసియేషన్(టీజీపీఏ)2024 నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ,కేక్ కటింగ్ కార్యక్రమం వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కందకట్ల శరత్ బాబు అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హనుమకొండ, వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు డా.బి.సాంబ శివ రావు, డాక్టర్.కె.వెంకటరమణలు హాజరై మాట్లాడుతూ వైద్య ఆరోగ్య శాఖలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమైనదని కొనియాడారు. ఫార్మసిస్టులు పేషెంట్ కు డాక్టర్లకు మధ్య వారధి లాంటి వారని, ఫార్మసిస్టులను ప్రభుత్వం వెంటనే ఫార్మసీ ఆఫీసర్లుగా గుర్తించాలని, ఫార్మసిస్టులకు ప్రమోషన్లు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన టీజీపీఏ రాష్ట్ర అధ్యక్షుడు బత్తిని సుదర్శన్ గౌడ్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం కాంట్రాక్ట్ ఫార్మసిస్టులందరినీ త్వరలోనే రెగ్యులర్ చేస్తుందని, రాబోయే నూతన పీఆర్సీలో ఫార్మసిస్టులకు మంచి వేతనాలు రావడానికి కృషి చేస్తామని, ఫార్మసిస్టులకు సపరేట్ ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేయుటకు కృషి చేస్తామన్నారు. కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్, వివిధ ఏజెన్సీల ద్వారా పనిచేస్తున్న ఫార్మసిస్టులు అందరికీ సమాన పనికి సమాన వేతనం రావడానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ సమావేశంలో హనుమకొండ జిల్లా ఫార్మసీ సూపర్ వైజర్ వి.పద్మజా దేవి, ఫార్మసీ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షులు, సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఫార్మసిస్ట్ ఉప్పు భాస్కర్ రావు, వరంగల్ జిల్లా అధ్యక్షులు డి.ప్రకాష్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ టి.సత్యం, జనరల్ సెక్రటరీ ఎ.వెంకట రమణ, కోశాధికారి అవినాష్, హనుమకొండ జిల్లా జనరల్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, కోశాధికారి సతీష్, హనుమకొండ, వరంగల్ జిల్లాల ఫార్మసిస్ట్స్ నాయకులు శైలజ, గోవర్ధన్, ప్రేమ్ సాగర్, సునీత, విజయ,సతీష్, సూరయ్య, వేణు, శ్రీదేవి, అజిత, సంతోష్, నాగేందర్ రెడ్డి, స్పందన, రమేష్, అనూష, ప్రభావతి, అంజి, అనిల్, వెంకన్న, సుధారాణి, సృజన, సరళా రాణి, శ్వేత, స్వాతి, అందరూ పెద్ద ఎత్తున పాల్గొని డీఎంహెచ్ఓలకు శాలువా, పూల బోకేలతో ఘనంగా సన్మానం చేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# ఇక సెలవు..

## రామా శ్రీనివాస్‌కు కన్నీటి వీడ్కోలు







గుండె పోటుతో కన్ను మూసిన సామాజిక వేత్త

మోక్షారామం ఫౌండేషన్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు

నివాళులర్పించిన ప్రముఖులు

అంతిమ యాత్రలో పాల్గొన్న కుల బాంధవులు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరల్డ్ పద్మశాలి క్లబ్ సృష్టికర్త, తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు రామా శ్రీనివాస్ కు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం జరిగిన అంతిమ యాత్రలో రాజకీయ నాయకులు, అభిమానులు, కుల బాంధవులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పుర ప్రముఖులు వేలాదిగా తరలి వచ్చి కన్నీటి పర్యంతమయ్యారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, సామాజిక సేవకులు రామా శ్రీనివాస్ (59) హైదరాబాద్ లోని ఆయన స్వగృహంలో మంగళవారం గుండె పోటుతో కన్నుమూసిన విషయం విధితమే.

ఆయన మృతి వార్త వినగానే ఓరుగల్లులో విషాదం నెలకొంది. ఆయన మోక్షారామం, అమ్మఒడిని స్థాపించి ఇక్కడి నుంచే సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఆయన పార్థీవ దేహాన్ని స్వగ్రామమైన వరంగల్ కు మంగళవారం సాయంత్రమే తీసుకొచ్చారు. నాయుడు పెట్రోల్ పంపు సమీపంలోని తనకు సంబంధించిన సిల్వర్ క్రౌన్ పాఠశాల ఆవరణలో పలువురి సందర్శనార్థం ఉంచారు. స్థానికులు పెద్ద ఎత్తున తరలి వచ్చి శ్రీనివాస్ పార్థీవ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను నెమరువేసుకున్నారు. స్నేహశీలి, మృధుస్వభావి, నిరాడంబరుడు, సేవాతత్పరుడు, తన చిరునవ్వుతో ప్రతి ఒక్కరిని పలకరిస్తూ అందరితో కలిసిపోయే రామ శ్రీనివాస్ ఇక లేడన్న విషయాన్ని జీర్ణించుకోలేక పోతున్నారు. బుధవారం మధ్యాహ్నం రామన్న పేటలోని మోక్షారామం ఫౌండేషన్ కు తరలించారు. అక్కడ స్థానికుల సందర్శన అనంతరం అంతిమయాత్ర నిర్వహించారు.

### కుటుంబ నేపథ్యం..

వరంగల్ రామన్నపేటలో జన్మించిన శ్రీనివాస్ కు భార్య శోభారాణి, కుమారుడు శైలేష్, కూతురు స్వాతి ఉన్నారు. నలుగురు సోదరులు, సోదరి ఉన్నారు. పద్మశాలి సామాజిక వర్గానకి చెందిన శ్రీనివాస్ పేద ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ వారి అభివృద్ధికి పాటు పడ్డారు. పుట్టిన ఊరికి సేవ చేయాలన్న సంకల్పంతో మోక్షారామం ఫౌండేషన్ ను ఏర్పాటు చేసి వేలాది మందికి చేయూత నందించారు. చివరి మజిలీ ఆహ్లాదకరంగా ఉండాలన్న తలంపుతో సొంతంగా లక్షల రూపాయలు ఖర్చు చేసి శ్మశాన వాటికలను అందమైన గార్డెన్ లుగా తీర్చిదిద్దారు.

### పలువురి సంతాపం..

గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ప్రముఖ క్లాస్ వన్ కాంట్రాక్టర్ వేముల సత్యమూర్తి, మాజీ రాజ్యసభ సభ్యుడు రాపోలు ఆనంద భాస్కర్, మాజీ మంత్రులు చంద్రశేఖర్, లక్ష్మారెడ్డి, ఈగ మల్లేశం, ఎమ్మెల్సీ ఎల్వీ రమణ, ఎమ్మెల్యే చింతం ప్రభాకర్, మాజీ ఎంపీ కెప్టెను లక్ష్మి కాంతారావు, పద్మశాలి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండు ప్రభాకర్, తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు, ఢీంబాయ్ టీవీ న్యూస్ ఛానల్ సీఈవో వేముల సదానందం, కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్, పరకాల పోపా అధ్యక్షులు డాక్టర్ పి.రాజేశ్వరప్రసాద్, కార్యదర్శి దుంపేటి నాగరాజు, పరకాల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బాసాని దయాకర్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, ఆర్ ఎస్ ఎస్ రాష్ట అధ్యక్షులు చిలుకమారీ సంజీవ, సీనియర్ జర్నలిస్ట్ మెండు రవీందర్ తదితరులు సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం ప్రతినిధులు, ఛాంబర్ సభ్యులు, వివిధ వ్యాపార సంఘాలు, వైద్యులు, ఏఓ సత్యనారాయణ, ఆడెపు రవీందర్, వడ్నాల నరేందర్, గోరంటల రాజు, దుస్స జనార్ధన్, రఘుపతి రెడ్డి, అప్పం శ్రీనివాస్, దుస్స శివశంకర్, వేముల శ్రీనివాస్, మార్గం ఎల్లయ్య తదితరులు తమ సానుభూతిని వ్యక్తం చేశారు.

### దారి పొడవునా నీరాజనం..

రామా శ్రీనివాస్ అంతిమ యాత్రకు జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సిల్వర్ క్రౌన్ పాఠశాలనుంచి ప్రారంభమైన ఈ యాత్రకు జనం నీరాజనం పలికారు. ఉదయంవ 11 గంటలకు ప్రారంభమైన అంతిమ యాత్ర నాయుడు పెట్రోల్ పంపు, రంగసాయిపేట, ఖమ్మ రోడ్డు, ఇసుక అడ్డ, బట్టల బజార్ మీదుగా రామన్నపేటలోని అమ్మఒడి కార్యాలయానికి చేర్చారు. అక్కడే స్థానికులు నివాళులర్పించారు. అమ్మఒడి ద్వారా వందలాది మందికి నిత్యం అన్నదానం చేసే గొప్ప వ్యక్తి ఇక లేడంటూ కంటతడి పెట్టారు. అనంతరం రామ శ్రీనివాస్ సొంత ఖర్చులతో అభివృద్ధి చేసిన రామన్నపేటలోని మోక్షారామం శ్మశాన వాటికలో ఆయన కుమారుడు రామా శైలేష్ అంతిమ సంస్కారాలను పూర్తి చేశారు. అంతిమ యాత్రలో పద్మశాలి సంఘం ముఖ్యనాయకులు బాల్నె శరత్, చందా మల్లయ్య, కూరపాటి సుదర్శన్, బాసాని చంద్రప్రకాశ్, వల్లకాటి రాజ్ కుమార్, గుండు విజయ్ రాజ్, వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, మాజీ అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి, మాజీ మంత్రి చంద్రశేఖర్, ఈగ మల్లేశం, చిప్ప వెంకటేశ్వర్లు, గొట్టెముక్కుల మధు, భేతి అశోక్, వడిచర్ల భాస్కర్, శ్రీనివాస్, కందగట్ల రవి, బాసాని శ్రీనివాస్, వి.రాజ్ గోపాల్ పాల్గొన్నారు.

### రామ శ్రీనివాస్ మృతి బాధాకరం..

వరంగల్ నివాసి ప్రముఖ పారిశ్రామికవేత్త రామ శ్రీనివాస్ గుండెపోటుతో అకాల మరణం చెందడం పట్ల తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు తాటిపాముల వెంకట్రాములు ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

















బుధవారం 10, జనవరి 2024
www.warangalvoice.net

# కోటి మొక్కులకు కొత్తకొండ సిద్ధం

**ఘనంగా భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణం**

**18 వరకు జాతర, బ్రహ్మోత్సవాలు**

**హాజరుకానున్న మంత్రి పొన్నం**

**ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు**





**వరంగల్ వాయిస్, భీమదేవరపల్లి :** కోర మీసాలు సమర్పిస్తే కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా పేరొందిన వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయం జాతరకు ముస్తాబైంది. 10న స్వామివారి కల్యాణంతో ప్రారంభమై 18 న అగ్ని గుండాలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి. 14న భోగి పండుగ,15న సంక్రాంతి, బండ్లు తిరుగుట (జాతర), 16న నాగవెల్లి, పుష్పయాగం, 17న త్రిశూల స్నానం,18న అగ్ని గుండాలు నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వీరభద్ర స్వామి దర్శనం కోసం పలు జిల్లాల నుంచి భక్తులు లక్షలాదిగా తరలిరానున్నారు. మకర సంక్రాంతి రోజున స్వామి వారిని దర్శించుకుంటే సర్వరోగ నివారణతో పాటు కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులు వెండితో చేసిన కోర మీసాలు స్వామి వారికి సమర్పిస్తారు. ముందుగా కోనేరులో స్నానమాచరించి గండ దీపం వద్ద నూనె పోసి, కోడెను కట్టి స్వామి, అమ్మవారిని దర్శించుకుంటారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, సిద్దిపేట, మెదక్, హైదరాబాద్ తదితర జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరానున్నారు.

### భక్తులకు సేవలు..

జాతరలో ముల్కనూర్ పీహెచ్ సీ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు 24 గంటలు, 30 మంది వైద్య సిబ్బందితో వైద్య సేవలు అందించనున్నట్లు వైద్యాధికారి ముడిరెడ్డి రాజశేఖర్ తెలిపారు. జాతరలో పరిశుభ్రతతో పాటు తాగునీరు అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీవో భాస్కర్ వెల్లడించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు హరిత హోటల్ సైతం అందుబాటులో ఉంది.

### పోలీసుల భారీ బందోబస్తు..

వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కాజీపేట ఏసీపీ డేవిడ్ రాజు నేతృత్వంలో ఎల్కతుర్తి సీఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో 600 కు పైగా పోలీసులతో భారీ బందోబస్తు నిర్వహించనున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు. గుడిలోపల, ఆలయ పరిసర ప్రాంతాల్లో 30 సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షించనున్నట్లు వెల్లడించారు. నాలుగు వైపులా చెక్ పోస్టులతో పాటు ప్రత్యేక బలగాలతో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

### అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం..

**– కిషన్ రావు, ఆలయ కార్య నిర్వహణ అధికారి**



జాతరకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశాం. తాగునీరు, చలువ పందిళ్లు, మూత్రశాలలు, మరుగుదొడ్లతో పాటు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయి. స్వామివారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. జాతరకు సుమారు పది లక్షల మంది భక్తులు వస్తారని అంచనాతో వసతులు కల్పిస్తున్నాం.




# ఫిబ్రవరి 6 వరకు ఓటరు నమోదుకు అవకాశం

## జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య నేడోక ప్రకటనలో తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆ దిశగా రాజకీయ పార్టీలు, నాయకులకు అవగాహన కల్పించాలని కోరారు. ఓటు నమోదు దరఖాస్తు స్వీకరణ చివరి తేదీ ఫిబ్రవరి 6వ తేదీగా ప్రకటించారు. కాగా ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన ఫిబ్రవరి 24న, అదేవిధంగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 14 వరకు అభ్యంతరాల స్వీకరణ ఉంటుందన్నారు. అలాగే అభ్యంతరాల పరిష్కారం అనంతరం మార్చి 29వ తేదీతో పాటు తుది జాబితా ఏప్రిల్ 4న విడుదల చేస్తామన్నారు. ఫిబ్రవరి 6వ తేదీ వరకు ఓటరు నమోదు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో 2023 నవంబరు 1వ తేదీ నాటికి డిగ్రీ పూర్తయి మూడేళ్లు నిండిన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ కోరారు. https:ceot-serms2.telangana.gov.in/mlc/form18.aspx వెబ్ సైట్ ద్వారా కూడా ఓటర్ గా నమోదు చేసుకోవచ్చున్నారు.





## కన్నుల పండువగా సాగిన..

# అక్షింతల పంపిణీ

**ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన రాముడి వేషదారణ**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని దుర్గా దేవి కాలనీలో శ్రీ రాములోరి అక్షింతల పంపిణీ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. కాలనీకి చెందిన మహిళలు పెద్దఎత్తున తరలి వచ్చి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డీజే సప్పుళ్లు, శ్రీరామ నామంతో ఆ ప్రాంతం మారు మ్రోగింది. రాముడి వేషదారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. శ్రీరాముడే దిగివచ్చి తమకు అక్షింతలు ఇచ్చినట్లుగా ఆయా కుటుంబాలు వారు భక్తి పారవశ్యంతో తేలియాడారు. కొబ్బరి కాయలు కొట్టి, పాదాబివందనాలు చేశారు. సుమారు నాలుగు గంటలపాటు సాగిన ఈ కార్యక్రమంలో దుర్గా దేవి ఆలయ కమిటీతోపాటు కాలనీ వాసులు పాల్గొన్నట్లు స్థానికుడు ఎన్నమనేని సంపత్ రావు తెలిపారు.

# ఆయుర్వేద వైద్య శిబిరానికి విశేష స్పందన

**ఆయుష్ ఆధ్వర్యంలో ఏర్పాటు**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విద్యారణ్యపురి గోపాలపురం హనుమకొండ ఆధ్వర్యంలో బుధవారం మడికొండలోని అంబేద్కర్ కమ్యూనిటీ హాల్ లో ప్రాంతీయ ఉపసంచాలకులు ఆయుష్ వరంగల్ సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం, మరియు లయన్స్ క్లబ్ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు కార్యక్రమ అధ్యక్షులు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నరసయ్య, ముఖ్యఅతిథి హనుమకొండ జిల్లా సంక్షేమ శాఖ అధికారిని మధురిమ తెలిపారు. మడికొండ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి, డాక్టర్ హరిత, డాక్టర్ సహజ, డాక్టర్ రాము, అంబేద్కర్ సంఘ అధ్యక్షుడు ప్రభాకర్, సారయ్య , నిగ్గుల వెంకట ప్రసాద్ వేదికపై ఆశీనులయ్యారు. ఆయుర్వేద వైద్య శిబిరంలో 206, కంటి వైద్య శిబిరంలో 86 మందికి పరీక్షలు నిర్వహించగా 36 మందికి కంటి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. శిబిరంలో అంబేద్కర్ సంఘ బాధ్యులు ప్రభాకర్, నరసయ్య, మూల ఐలయ్య వైద్యులతో పాటు శిబిరానికి విచ్చేసిన వారికి సౌకర్యాలు కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు తేరాల యుగేందర్, కార్యదర్శి గోకరపు రాజేందర్, నాగులగాం నరసయ్య, ఉపాధ్యక్షులు గంటి సాంబయ్య, రాజమౌళి, మల్హాల్ రావు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE. EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com